# అక్షరము–1

అక్షరమును ఎరుగని వారుండరు కదా! అఆ.....కఖ..... ఇవి అక్షరములు. ప్రతి మానవునకును అన్ని అక్షరములను పలికెడి శక్తి ఉన్నది. అ ందువలననే తెలుగువారు ఇంగ్లీషు, ఫ్రెంచి వంటి పరభాషలు పలుకగలుగు చున్నారు. ప్రపంచములో అన్ని దేశముల వారును "హరేరామ", హరేకృష్ణ" భజనలు చేయుచున్నారు. అమెరికనులు వేదపఠనము చేయగలుగుచున్నారు. కనుక అక్షరోచ్చరణ శక్తి సర్వమానవులకు సమానము.

మనమీ శక్తిని దేనికి ఉపయోగించుచున్నాము? మాటలు కూర్చుటకు. మాటలను ఎందుకు చేయుచున్నాము? పేర్లు పెట్టుటకు. రెండు, మూడు, నాలుగు అక్షరములను పేర్చి, ఒకమాట చేసి, మనకు తెలిసిన దానికి, అనగా మనము ఎరిగిన దానికి పేరు పెట్టుచున్నాము. వస్తువులకు (కాయ, పుస్తకము), చేసెడి పనులకు (వ్రాయుట, కోయుట) పేరులు పెట్టుచున్నాము. తిరిగి వాటికి నామవాచకములని (Nouns), క్రియలని (Verbs) పేరులు కలిపించు చున్నాము. ఈ రెండు విధములయిన మాటలకును, మనకు తెలిసిన పద్ధతిలో కలుపుటకు – "చేత, వంటి, కొరకు" మొదలైన మాటలనుగూడ తయారు చేయుచున్నాము. ఈ మాటల గుంపును ఒక విధమైన వరుసలో పెట్టి, దానికి వాక్యమని పేరు పెట్టినాము. ఈ మాటల గుంపునకు, ఈ వాక్యము నిర్మించు పద్ధతికిని– "భాష" అని పేరు పెట్టినాము.

మనము వేటివేటికి పేరులు పెట్టుచున్నాము? అనగా, వేటికొరకు పేరులు తయారు చేయుచున్నాము? మనము చూచిన వాటికి (కొండ, నది). మనము తయారు చేసిన వాటికి (కుర్చీ, బల్ల). మన మనస్సులో ఊహ వచ్చిన దానికి (ఉపన్యాసము, వ్యాసము, రాజ్యాంగము).మనము దేనిని చూచినను, కనుగొనినను, చేసినను, ఊహించినను, దానికి పేరు పెట్టి తీరెదము. అది మన జ్ఞానపరిధి లోనికి వచ్చినచో, దాని పేరు కొరకు ఒక మాటను కల్పించి తీరెదము. కనుక ఒక విషయము యొక్క జ్ఞానము ముందు. దాని పేరు లేక మాట తరువాత.

అందువలన మనకు తెలియని విషయములకు మన భాషలో మాటలు లేవు. ఉండవు. అటులనే తక్కిన ప్రపంచ భాషలు కూడ. మానవునిఊహలోనికి రాని విషయమునకు మానవభాషలో పేరు ఉండదు. దానికి మాటలేదు.

ఈ విధముగ, మనకు తెలిసిన తరువాత, మనము తయారు చేసిన తరువాత, వాటికి పేరులు పెట్టుచుండగా, మన నోటినుండి వచ్చు అక్షరము మన ప్రమేయము కోరక, తన పేరు తాను చెప్పుకొనుచు బయటకు వచ్చుచున్నది. నా పేరు "అ" అని చెప్పుచు అకారము నోటినుండి బయటకు వచ్చుచున్నది. నేను ఎక్కడనో నీలోని అంతరాంతరము లనుండి బయటకు వచ్చుచున్నాను. నీవు చాల ప్రయత్నము చేసినగాని నే పుట్టు చోటు నీకు తెలియదు. నీకు నా జ్ఞానము లేదు. అందువలన నా పేరు నేను పెట్టుకొని పుట్టుచున్నాను. నీవు నీ మాటల కొరకు నా పేరు వాడుకొన వచ్చునని చెప్పుచున్నది. అదియేవిధముగ, తక్కిన అక్షరములు కూడను. ఇది ఆశ్చర్యకరమయిన విషయము కదా!

ఈ అక్షరములను, వాని పుట్టుపూర్వోత్తరములను తెలియకుండగనే ప్రతిదినము అన్నిభాషలవారు, అన్ని కాలములవారు వాడిరి కదా! వాడుచున్నారు కదా! ఇక ముందుకూడ వాడెదరు కదా! వీటి సహాయముతో అన్ని శాస్త్రములను చదువుచుంటిమి కదా! కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఇంజనీరింగ్, వేదాంతము, వ్యాకరణము, మీమాంస, తర్కము – ఒకటేమిటి, ప్రపంచమునందున్న విజ్ఞానమంతటిని పిండి చేసి మ్రింగుచుంటిమి గదా! ఇంత పండితులు, ఇంత శాస్త్రజ్ఞులు, తత్త్వవేత్తలు (Philosophers) "అక్షర" జ్ఞానము లేనివారు గదా!

ఈ అక్షరజ్ఞానము కలుగుట ఎట్లు? అక్షరమును గురించి సంపూర్ణముగ తెలియజెప్పెడిది ఒక్కటే పుస్తకము. "వేదము". వేదము అనగా తెలియజెప్పెడిది – అని అర్థము. దేనిని తెలియజెప్పెడిది? అక్షరము, దాని పుట్టినచోటును తెలియజెప్పును. అక్షరము పుట్టినచోటు మనము గదా! కనుక వేదము మనలను గురించి మనకు తెలియజెప్పును.

"నేను", "మనము" అనిన పదార్థములను గురించి మనకేమియు తెలియదు కాన, మానవభాషలలో దాని విషయముండదు. దాని విషయము వేదము వలననే తెలియును. వేదమా విషయమును ఏ భాషలో చెప్పెను? అందరు మానవులకు, ఎవరికి వారు తెలుసుకొనవలసిన విషయము కావున, అందరు మానవులును ప్రయత్నించినచో తెలిసికొన గలిగిన భాషలో చెప్పెను. అది అక్షర భాష. అనగా మాటలు కాక, అక్షరములు ప్రధానమైన భాష. అక్షరములు ప్రతి మానవుని నోటియందును ఉండును గాన, వాటిని పలుకగలడు కావున, వాటిని గురించి ఆలోచింపగలడు. తన నోటి నుండి వెలువడినవి గాన, పలుకుటకు చేసిన ప్రయత్నము తనదే కావున, వేదమా ప్రయత్నమునే, ఆ అక్షరము యొక్క అర్థము చేసినది కావున, ఆలోచించినచో, వేదము అక్షరమునకు ఇచ్చిన అర్థము ఎవరికి వారికే తెలియును. సృష్టి ఆరంభమునుండి, అంతమువరకు పుట్టెడి ప్రతి మానవుడును వేదాక్షరమునకు అర్థము ప్రయత్నముచేత, అనగా, ఆలోచనతోడ తనకు తాను తెలిసికొన గలుగును. కనుక వేదభాష నిత్యమైన భాష. అది అద్దము వంటిది. అందు ప్రతి మానవుడును, తన స్వరూపమును తాను తెలిసికొన వచ్చును. ఆ అక్షరములు తెలిపిన మార్గమునపోయి, తాను ఉత్తమ స్థితి పొందవచ్చును. అక్షరము అనగా నిత్యమైనది. వేద భాష అక్షరము. వేదము అక్షరము. దానిని అర్థము చేసుకొని మానవుడు గూడ అక్షరుడవవచ్చును. మానవుడు అక్షరుడగు వీలుచూపుట కొరకే వేదము పుట్టినది.